
సాక్షి
ఒడిశా

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,03,350లు, బంగారం7గ్రాము 550 మిల్లీగ్రాములు, వెండి 303 గ్రాములు 450 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



విపత్తుల నుంచి బయటపడడమే లక్ష్యం

ప్రకృతి విపత్తుల నుంచి బయటపడడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం ముందుకు కదలాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా పిలుపునిచ్చారు.

- 8లో



ప్రయాణికుల రైళ్ల రద్దు పొడిగింపు

కొత్తవలస-కిరండోల్ రైల్వేలైన్‌లో ప్రయాణికుల రైళ్ల రద్దు కొనసాగుతోంది.

- 8లో

రయ్.. రయ్..!



పచ్చజెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

- మల్కన్‌గిరిలో లక్ష్మీ బస్సులు ప్రారంభం
- మారుమూల గ్రామాలకు పెరగనున్న సౌకర్యాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మల్కన్‌గిరి: స్థానిక స్టేడియం వద్ద ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ లక్ష్మీ బస్సులను గురువారం ప్రారంభించారు. జిల్లా మొత్తం మీద 36 బస్సులు వేశారు. మల్కన్‌గిరి, మత్తిలి, కోరుకొండ, ఖోయిర్‌పుట్, కలిమెల, పోడియ, చిత్రకొండ సమితుల్లో వున్న 111 పంచాయతీల్లో ఈ బస్సుల సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.800 కోట్లతో ఈ బస్సులను నడుపుతోంది. బస్సు ప్రారంభించిన అనంతరం సీఎం నవీన్ పట్నాయక్ తొలి టికెట్టు కొనుగోలు చేశారు. పార్టీ కార్యకర్తలతో కలిసి స్టేడియం నుంచి ఎంవీ 3 గ్రామం వరకు ప్రయాణించారు.

ఇక్కడి నుంచే అభివృద్ధి పనులు

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు మల్కన్‌గిరి నుంచే ప్రారంభించినట్లు తెలియజేశారు. బియ్యం కిలో రూ.1 నుంచి గురుప్రియ వంతెన వరకు ఇలా అనేక అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. లక్ష్మీ బస్సులతో మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని తెలియజేశారు. విద్యార్థులు, రోజుకూలీలు, రైతులు, ఉద్యోగులు, మహిళలకు లక్ష్మీ బస్సులు ఎంతో సహకరిస్తాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇక్కడి ప్రజలు విమాన ప్రయాణాలు సైతం చేస్తారని తెలియజేశారు. అలాగే ఎయిర్ పోర్టు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

కష్టాలు తీరాయి

నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మాఝి మాట్లాడుతూ.. లక్ష్మీ బస్సులతో మల్కన్‌గిరి ప్రజల కష్టాలు తీరాయని పేర్కొన్నారు. చిత్రకొండ సమితిలో ప్రజలు కేవలం నాటు పడవలతోనే ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే చిత్రకొండ జలాశయం దాటాల్సి వచ్చేదని పేర్కొన్నారు. ఇప్పుడు లక్ష్మీ బస్సుల సౌకర్యాలతో ఇక నుంచి ప్రజలకు మెరుగైన రవాణా దొరుకుతుందని తెలియజేశారు. అలాగే బోండఘట్టీ, మత్తిలి సమితి మొహిపోదర్ పంచాయతీల ప్రజల కష్టాలు సైతం తీరుతాయని చెప్పడానికి ఆనందంగా ఉందన్నారు. చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క మాట్లాడుతూ మల్కన్‌గిరి జిల్లా ప్రజలకు ఈరోజు చారిత్రాత్మకమైన రోజుగా గుర్తుండిపోతుందని తెలిపారు. అనంతరం మల్కన్‌గిరి జిల్లా అభివృద్ధికి గాను రూ.192 కోట్ల నిధులను కేటాయించి 18 కొత్త ప్రాజెక్టులను సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో 5టీ కార్యదర్శి వీకే పాండియన్, రాష్ట్ర బీజేడీ కార్యదర్శి ప్రణప్రకాష్ దాస్, మల్కన్‌గిరి గిరిజన అభివృద్ధి సభ్యులు అడ్మార్యా, కలెక్టర్ విశాల్ సింగ్, మంత్రి టుకున సాహు తదితరులు పాల్గొన్నారు.





లక్ష్మీ బస్సుల పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్ (ఇన్‌సెట్లో) లక్ష్మీ బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



కళాకారులకు అభివాదం చేస్తున్న సీఎం



లక్ష్మీ బస్సులో తొలి ప్రయాణం చేస్తున్న దృశ్యం



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్నటువంటి గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వర్సిటీ వీసీ ఏవీఎన్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలని ఆకాంక్షించారు. మొత్తం 100 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ పేమమాన్సు శేఖర్ రౌత్, డాక్టర్ ఎస్ఎస్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ తగలబెట్టిన దుండగులు



పూర్తిగా దగ్ధమైన స్కూటీ

రాయగడ: స్థానిక రైల్వే కాలనీలో నివసిస్తున్న పి.గౌరీ శంకర్ అనే వ్యక్తి ఇంటి బయట ఉన్న స్కూటీని గుర్తు తెలియని దుండగులు తగలబెట్టారు. బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు స్కూటీని తగలబెట్టడంతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దీంతో కంగారుగా లేచి చూసేసరికి స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

న్యాయ అవగాహన శిబిరం



మాట్లాడుతున్న నివేదిత పండ వేదికపై శుభ్ర పండ, భాస్కర్ రైతా తదితరులు

రాయగడ: లైంగిక వేధింపుల బారి నుంచి మహిళలు చట్టపరంగా న్యాయం పొందడానికి, చట్టంపై వారికి పూర్తి అవగాహన అవసరమని జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి నివేదిత పండ అన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. లైంగిక వేధింపులను నివారించడానికి మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఎదురించి తమ హక్కులను సాధించాలంటే న్యాయ సహాయ సంస్థను బాధిత మహిళలు ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శుభ్రా పండ, ఏడీఎం భాస్కరరైతా, లీగల సర్వీస్ అథారిటీకి చెందిన ప్యానల్ అడ్వకేట్ సీతారాం పండ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి'

జయపురం: మాలి, రోణ సాంప్రదాయ ప్రజలను ఎస్టీలుగా గుర్తిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భూమియ కుల సమాజ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు భూమియ కుల సమాజ్ అధ్యక్షుడు గురునాథ్ పూజారి నేతృత్వంలో వందలాది మంది భూమియ సాంప్రదాయ ప్రజలు జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. అనంతరం కలెక్టర్‌ను ఉద్దేశించిన వినతిపత్రాన్ని కార్యాలయంకు అందజేశారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలతో మాలి, రోణ సాంప్రదాయాలకు ఎటువంటి పోలికలు లేవని, వారిని ఆదివాసీలుగా గుర్తిస్తే ఆదివాసీ ప్రజల అధికారాలను లాక్కుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాగే అనేక మంది ఆదివాసీలుగా ప్రభుత్వ పథకాలు పొందుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో భూమియ సమాజ్ నేత నారాయణ కదంబగుడియ, నరేంద్ర కందులియ, త్రినాథ్ సామరత్, గురునాథ్ పూజారి, గౌరచంద్ బాగ్దేరియ, లక్ష్మణ నాయిక్, బినాయక పూజారి, లలిత పూజారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ బంధాలు మెరుగు



నృత్యాలు చేస్తున్న బాలికలు

జయపురం: క్రీడలతో యువతలో స్నేహ బంధాలు మెరుగవుతాయని ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం సమితి ద్వారా స్వతంత్ర అభివృద్ధి పరిషత్(ఎస్‌డీయూ) కప్-2023 క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల యువతకు ఆటలపై ఆసక్తి పెరగడానికి ఇటువంటి క్రీడా పోటీలు ఎంతో అవసరమన్నారు. జిల్లా స్వతంత్ర పరిషత్ ప్రతీ సమితిలోనూ సమితి స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమని కొనియాడారు. గెలుపు ఓటములను పరిగణలోకి తీసుకోకుండా క్రీడాకారులు స్ఫూర్తి చాటాలన్నారు. బీడీవో రాజీవ్ దాస్ మాట్లాడుతూ.. యువతలో నైపుణ్యాన్ని వెలికి తీయడమే ఎస్‌డీయూ పోటీల ఉద్దేశమని వెల్లడించారు. కార్యక్రమంలో సమితి చైర్‌పెర్సన్ తిలోత్తమ ముదులి, జిల్లా పరిషత్ సభ్యులు రశ్మీ రథ్, తిపతి పట్నాయిక్, అస్థ నాయిక్, ఎస్‌డీసీ సభ్యులు బైద్యనాథ్ నాయిక్, గంగాధర హల్వ, బిజూ నిర్మాణ సమాఖ్య అధ్యక్షుడు బాలా రాయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

ఇద్దరు వ్యక్తులు అరెస్టు

జయపురం: పెట్రోలు వేయించుకునేందుకు బైక్‌పై వెళ్తున్న ఒక వ్యక్తిని దారుణంగా కొట్టి, అతడి మెడలో బంగారు గొలుసు దొంగిలించిన వారిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసులు బుధవారం తెలియజేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జయపురం భద్రయ్యవీధికి చెందిన జి.రాజశేఖర్ ఈనెల 10వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ వేయించేందుకు టౌన్‌హాల్ వైపు వెళ్తుండగా అటువైపు గణేష్ నిమజ్జనం ఊరేగింపు వస్తోంది. దారి కోసం రాజశేఖర్ హారన్ మోగించగా గోపబందునగర్, ఒడియా మేదరి సాహిలకు చెందిన ఉమేష్ కులదీప్, బాదల్, లెప్తి ఆచారి, లల్లు, పవన్ బాగ్, ఆకాశ్ మఝి, అమన్ టక్రి, రంజన్ టక్రి, కుందాగుడకు చెందిన రాజీవ్, మనోజ్ తదితరులు అతనిపై దారుణంగా దాడికి దిగారు. అంతేకాకుండా రాజశేఖర్ మెడలో బంగారు గొలుసు లాక్కొచ్చి, బైక్‌ను డ్యామేజ్ చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి రాజశేఖర్‌ను కాపాడి జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం గోపబందునగర్‌కు చెందిన బాదల్, లెప్తి ఆచారీలను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని, కేసు దర్యాప్తు జరుపుతున్న సజీవి కుమార్ హమంతి వెల్లడించారు.



అరెస్టైన బాదల్, ఆచారీలు

ఎమ్మెల్యే పీతం పాడీకి పితృ వియోగం



దశరథి పాఢి

కొరాపుట్: కొరాపుట్ జిల్లా పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢీ తండ్రి దశరథి పాఢి (67) తుదిశ్వాస విడిచారు. గురువారం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి పక్కజొల గ్రామంలోని స్వగృహంలో మృతి చెందారు. గత కొంతకాలంగా దశరథి అనారోగ్యంతో బాధపడుతున్నారు. మల్కన్‌గిరి జిల్లా ముఖ్యమంత్రి పర్యటనకు ఎమ్మెల్యే బయల్దేరుతుండగా ఈ పరిణామం జరగడంతో తన పర్యటన వాయిదా వేసుకున్నారు. విషయం తెలియడంతో కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జిన్ను హిక్కా, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకలు ఫోన్‌లో పరామర్శించారు.

కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్‌పాత్రో అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. అనంతరం సీడీఎంవో కార్యాలయంలో జరిగిన సాధారణ సభలో ప్రభుత్వ కంటి నిపుణులు డాక్టర్ చందన్ మేకప్, ఓ.ఏ.దుదిరాం సింగ్, డాక్టర్ శరత్ చంద్ర మహాపాత్రో, ఆదనపు పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ నారాయణ మల్లిక్, ఏపీడీమీయోలజిస్టు డా.ఇందిరా మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు. కంటి ఆరోగ్యం కోసం ఎక్కువ సేపు కంప్యూటర్, టీవీ, మొబైల్ వంటివి చూడవద్దని సూచించారు.

పైలెట్ ప్రాజెక్టు పనులు ప్రారంభం



మట్టి పరీక్షలు నిర్వహిస్తున్న వైజ్ఞానిక బృందం

జయపురం: ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సాయంతో కొరాపుట్ జిల్లాలో వ్యవసాయ పైలెట్ ప్రాజెక్టు గురువారం ప్రారంభమైంది. వ్యవసాయ జిల్లాగా పేరుగాంచిన ఈ జిల్లాలో ఏ ప్రాంతంలో ఏ ఏ పంటలు సాగు చేయవచ్చో తెలుసుకునేందుకు మట్టి పరీక్షలు ప్రారంభించారు. ఈ మట్టి పరీక్షల కోసం రూ.100 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పరీక్షలు జరిపేందుకు కలకత్తా నుంచి ఐదుగురు వైజ్ఞానికుల బృందం జయపురం విచ్చేసింది. వారికి రాష్ట్ర వ్యవసాయ విభాగ వైజ్ఞానికులు, మట్టి సంరక్షణ విభాగాల అధికారులు సహకరిస్తున్నారు. శాటిలైట్ సహకారంతో గ్రామాల్లో మట్టి పరీక్షలు జరుపుతున్నట్లు బృందం సభ్యుడు సిలాదిత్య బందోపాధ్యాయ వెల్లడించారు. అత్యాధునిక సాంకేతికను వినియోగిస్తూ మట్టి నాణ్యత, మట్టిలో ఉండే వివిధ పదార్థాలను కనుగొని నివేదిక తయారు చేయనున్నట్లు వెల్లడించారు. ఏ మట్టిలో ఎటువంటి పంటలు పండించవచ్చో, ఎక్కడ మిశ్రమ పంటలు పండుతాయో, ఏ మట్టిలో పంటలు పండవో, తక్కువ సాగునీటితో ఎలా పంటలు పండించాలి తదితర విషయాలతో తాము తయారు చేసే నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. అంతే కాకుండా మరోసారి పరీక్షలు జరిపేందుకు మట్టిని కలకత్తా తీసుకెళ్తామని వెల్లడించారు.

ఘనంగా రబిసింగ్ జయంతి



వేదిక మీద ఉన్న వివిధ పార్టీల నాయకులు

కొరాపుట్: స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత రబిసింగ్ మజ్జి 101వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ సమితి బమిని గ్రామ పంచాయతీ బట్టిబెడ గ్రామంలో సంస్మరణ కార్యక్రమాలు జరిగాయి. రబిసింగ్ నబరంగ్‌పూర్ జిల్లాలో గిరిజన తెగలతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య అనంతరం రాష్ట్ర మంత్రిగా పని చేశారు. సంస్మరణ సభకు ముందు వందలాది రబిసింగ్ మద్దతుదారులు తమ సాంప్రదాయ గోండో గిరిజన జాతి నృత్యాలతో ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా రబిసింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీకి చెందిన ఉమ్మర్ కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గోండో, బీజేడీకి చెందిన జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జి, సీనియర్ నాయకుడు జయదేవ్ పరిడా, మాజీ ఎంపీ భగవాన్ మజ్జి తదితరులు పాల్గొన్నారు.



గోండో జాతి గిరిజనుల సాంప్రదాయ ర్యాలీ

బిసంకటక్‌లో కాంగ్రెస్ ర్యాలీ

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ బుధవారం నిర్వహించింది. బిసంకటక్ శాసనసభకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు రంగంలో ఉన్నటువంటి రాష్ట్ర మాజీ మంత్రి డొంబురు ధర ఉలక తనయుడు నీలమాధవ ఉలక నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ ఇచ్చిన పిలుపు మేరకు ఇంటింటా కాంగ్రెస్ నినాదంతో కార్యకర్తలు ఈ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ ర్యాలీలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ అధ్యక్షులు బిజయ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న బిజయ పట్నాయక్, నీలమాధవ ఉలక తదితరులు

క్లుప్తంగా

మొదటి భార్యనూ హత్య చేసిన ఘనుడు భగత్ హరిజన్



పోలీసులు అరెస్టు చేసిన భగత్ పూజారి

జయపురం: స్థానిక డొంగాగుడ గ్రామంలో తన రెండో భార్య కుసుమ పూజారిని దారుణంగా హత్య చేసిన భగత్ పూజారి సామాన్యుడు కాదని, అతడు తన మొదటి భార్య గురుమతి హరిజన్‌ను 1984లో బొరిగుమ్మలో హత్య చేశాడని జయపురం పోలీసులు వెల్లడించారు. ఆ నేరం కింద అతడు 1984 నుంచి 2000 సంవత్సరం వరకు కొరాపుట్ జైలులో శిక్ష అనుభవించాడని వెల్లడించారు. 2001లో అతడు జయపురం సమీప డొంగాగుడ వచ్చి భర్త పోయిన కుసుమ పూజారి ఉరఫ్ కుసుమ హరిజన్‌ని రెండో భార్యగా ఉంచుకున్నాడని వెల్లడించారు. ఆమె ఒక జీడి పిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోందన్నారు. భగత్ హరిజన్ ఎల్లప్పుడు తాగి వచ్చి ఆమెను టార్చర్ చేస్తుంటాడని వెల్లడించారు. ఈ క్రమంలో ఆమెను కూడా అతడు హత్య చేశాడని వెల్లడించారు. అతడిని గురువారం కోర్టులో హాజరుపరచినట్లు వెల్లడించారు.

కూలిన మామిడి చెట్టు



రహదారిపై కూలిన మామిడి చెట్టు

బూర్జ: మండలంలోని కొల్లివలస జంక్షన్ (ఆంజనేయ గుడి) వద్ద ప్రధాన రహదారిపై గురువారం మామిడి చెట్టు కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 3గంటల సమయంలో మండలంలో పలు చోట్ల వర్షం కురిసింది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. స్థానికులు చెట్టు కొమ్మలు తొలగించారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ. 3,24,126



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం నీలమణి దుర్గ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ఈఓ వాసుదేవరావు సమక్షంలో లెక్కించారు. 29 రోజులకు గాను అమ్మవారి హుండీ ఆదాయం రూ. 3,24,126 వచ్చిందని ఆయన తెలిపారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ నూలు ఈశ్వరరావు, సభ్యులు కృష్ణారావు, చిన్నారావు తదితరులు ఉన్నారు.

వివాహిత మృతి కేసులో ఐదుగురు అరెస్టు



పరశురాంపురం గ్రామంలో మెళియాపుట్టి ఎస్ఐతో కలిసి కేసు వివరాలు పరిశీలిస్తున్న డీఎస్పీ వాసుదేవరావు

మెళియాపుట్టి: ముకుందాపురం పంచాయతీ పరిధిలోని పరశురాంపురం గ్రామానికి చెందిన వివాహిత జన్ని అశ్విని(21) మృతి కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆమె మృతిపై పలు అనుమానాలు ఉండటంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేశారు. అశ్వినిని వరకట్నం తీసుకురావాలని వేధించినట్లు మృతురాలి తల్లి చీర కాంతమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందారోపణలు రుజువు కావడంతో మృతురాలు అశ్విని భర్త జన్ని కృష్ణారావు, అత్తమామలు జన్ని తులసమ్మ, జన్ని పుచ్చన్న, ఆడపడుచులు గొడ్డూరు ఆదిలక్ష్మి, గొడ్డూరు శ్రీదేవిలను గురువారం శ్రీకాకుళం దిశ డీఎస్పీ సుగ్గ వాసుదేవ్ అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. అనంతరం పాతపట్నం సబ్ జైలుకు రిమాండ్‌కు పంపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.లక్ష్మి తెలిపారు. గత కొంతకాలంగా ఇదే పరిసర ప్రాంతాల్లో యాచక వృత్తి చేస్తూ తిరిగేవాడని, గురువారం ఓ రెస్టారెంటు సమీపంలో పడిపోయి ఉండటంతో స్థానికులు సంబంధిత వీఆర్వోకు, రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మి పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



గొడొచండీ అమ్మవారి హర చండీ అలంకారం



కమల అలంకరణలో ఝుంజిరి మంగళా అమ్మవారు



రాజ రాజేశ్వరి రూపంలో దర్శనమిచ్చిన చవులియాగంజ్ జయ దుర్గామాత



ఉగ్రతార రూపంలో వాసంతి అమ్మవారు



అన్నపూర్ణ స్వరూపిణిగా గొడొగొడియా దక్షిణ కాళీమాత

శోడష దినాత్మక పూజలు పురస్కరించుకుని జగన్మాత పలు శక్తి పీఠాల్లో నిత్య నూతనంగా వెలుగొందుతోంది. రోజుకో అలంకరణతో భక్తులకు దర్శనమిస్తోంది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తుతున్నారు. గత 7 రోజులుగా ప్రత్యేక అలంకారాల్లో అమ్మవారి దర్శనం భక్తులకు లభిస్తోంది.

– భువనేశ్వర్



పిరాపూర్ దకులై అమ్మవారి కమల దేవి అలంకరణ



వనదుర్గ అలంకారంలో చార నారాయణి దేవి



జయదుర్గ అలంకరణలో కటక్ చండీమాత

విపత్తుల నుంచి బయటపడడమే లక్ష్యం

- మడ అడవుల పెంపకంతో తీర ప్రాంతాలకు మేలు
- ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా



ప్రదీప్ కుమార్ జెనా అధ్యక్షతన విపత్తు నిర్వహణ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ప్రకృతి విపత్తుల నుంచి బయటపడడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం ముందుకు కదలాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన విపత్తు నిర్వహణ రాష్ట్ర కార్యవర్గ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుఫాన్‌ల నుంచి రక్షణకు సమర్థవంతమైన సహజమైన ప్రణాళిక అవసరమన్నారు. తీర ప్రాంతాల్లో దట్టమైన మడ అడవుల పెంపకం, తాటి చెట్ల పెంపకం తుఫాన్‌ల నుంచి రక్షణకు అత్యంత ఉత్తమ సోపానంగా పేర్కొన్నారు. పెరుగుతున్న పిడుగుపాటు మరణాలను నివారించడానికి సైతం భారీ తాటి చెట్ల పెంపకం దోహదపడుతుందన్నారు. ఒడిశా అగ్ని మరియు అత్యవసర సేవల కోసం గాలింపు మరియు సహాయక చర్యల పరికరాలు, ఉపకరణాలు మరియు వాహనాల సేకరణపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ కోసం ప్రతిపాదించిన రూ.240,33,51,108 నిధుల్లో ఇప్పటికే రూ.159,02,19,356 విడుదలయ్యాయని పేర్కొన్నారు.

తాటిచెట్లను అధికంగా పెంచాలి

ప్రధానంగా పిడుగులు పడే అవకాశం ఉన్న జిల్లాల్లో తాటి చెట్ల పెంపకాన్ని అధికంగా చేపట్టాలని అటవీ శాఖకు చీఫ్ సెక్రటరి జెనా సూచించారు. ఒడిశా రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఓస్డమా) మెరుపు హెచ్చరిక సతర్క్ యాప్ కార్యాచరణ 3 ఏళ్లపాటు కొనసాగించాలని ప్రతిపాదించింది. దీంతో పిడుగుపాటు మరణాల నియంత్రణకు దోహదపడుతుందన్నారు. ఎర్త్ నెట్‌వర్క్ మరియు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (ఐఐటీఎం), పూణే సహకారంతో సతర్క్ యాప్ మూడేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయించారు. ఐఓసీ మరియు యునెస్కో ధ్రువీకరించిన సునామీ ఎదురీతకు సిద్ధంగా ఉన్న తీర ప్రాంతాల్లో సునామీపై ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించాలన్నారు. 6 తీరప్రాంత జిల్లాల్లోని 24 సునామీ పీడిత గ్రామాల్లో హిందూ మహా సముద్ర సునామీ రెడీ (ఐఓటీఆర్) కార్యక్రమాల అమలు కోసం ఓస్డమా ద్వారా ప్రతిపాదించింది. పూరీ, కోణార్క్, గోపాల్‌పూర్ మరియు పారాదీప్ మున్సిపాలిటీ పరిధిలో సునామీ పీడిత ప్రాంతాల్లో ఓరియెంటేషన్ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు.



వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ఏప్రిల్ 1 నాటికి ఎస్‌డీఆర్ ఖాతాలో సమగ్ర నిధులు రూ.3765.74 కోట్లు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా కింద కార్పస్ నిధి రూ.2,358.00 కోట్లు, ఈ లెక్కన రాష్ట్ర విపత్తు ప్రమాద నిర్వహణ (ఎస్‌డీఆర్ఎమ్) కోసం సమగ్రంగా రూ.5,158.14 కోట్లు అందుబాటులో ఉన్నాయని విశ్లేషించారు.

'లోకో సిబ్బందికి న్యాయం చేయండి'



ఏఐఎల్ఆర్ఎస్ఏ నిరాహార దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కార్మిక నాయకుడు

భువనేశ్వర్: రాత్రింబవళ్లు పట్టాలపై నిరవధికంగా రైళ్లని పరుగులు తీయించే లోకో పైలట్లకు తీరని అన్యాయం జరుగుతోందని అఖిల భారత లోకో రన్నింగ్ సిబ్బంది సంఘం (ఏఐఎల్ఆర్ఎస్ఏ) ఆవేదన వ్యక్తం చేస్తోంది. దీర్ఘకాల సమస్యలతో సతమతమవుతున్న రన్నింగ్ సిబ్బందికి న్యాయం జరిగేలా తక్షణ ఉత్తర్వులు జారీ చేయాలని తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మకు ఈ వర్గం అభ్యర్థన పత్రం అందజేసింది. అంతకు ముందు జనరల్ మేనేజర్ ప్రధాన కార్యాలయం చంద్రశేఖర్‌పూర్ ప్రాంతంలో గురువారం శాంతియుతంగా నిరాహార దీక్ష చేపట్టింది. ఈ శిబిరంలో బాధిత సిబ్బంది ప్రత్యక్షంగా హాజరై జనరల్ మేనేజర్‌కు గోడు వినిపించారు. ఏఐఎల్ఆర్ఎస్ఏ తూర్పు కోస్తా రైల్వే శాఖ ప్రధాన కార్యదర్శి జె.పి.దండపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభా కార్యక్రమంలో సిటూ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జనార్దన్ పతి వంటి ప్రముఖ కార్మిక నాయకులు ప్రసంగించారు. ప్రయాణికులు, సరుకు రవాణా రంగంలో భద్రత దృష్ట్యా లోకో రన్నింగ్ సిబ్బందికి సమయానుకూలంగా ఉన్నత శిక్షణతో పనివేళలు పరిమితం చేయడం అనివార్యం. ఈ కేడరులో ఖాళీలు భర్తీ చేయడంతో అర్హులైన వారికి సకాలంలో పదోన్నతి, బదిలీ విధానం సరళీకరణ కోసం దీర్ఘకాలంగా యాజమాన్యంతో జరుపుతున్న చర్చలు, సంప్రదింపులు ఫలప్రదం కావడం లేదని వివరించారు. రైల్వే శాఖ ఆదేశాల మేరకు 120 కిలోమీటర్ల హామీ పూర్వక మైలేజీ మంజూరు కాకపోవడం నిరుత్సాహానికి గురిచేస్తోందన్నారు. మహిళా లోకో రన్నింగ్ సిబ్బందికి విరామ కేంద్రాల్లో సముచిత మౌలిక సౌకర్యాలు కొరవడుతున్నాయని పేర్కొన్నారు. నిద్ర లేకుండా రాత్రి పూట డ్యూటీని 4 రోజుల నుంచి 2 రోజులకు కుదించడం భద్రత పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. పలుచోట్ల క్షేత్ర స్థాయి ఉన్నత శ్రేణి సిబ్బంది వేధింపులు పెచ్చుమీరుతున్న పరిస్థితులపై సత్వర చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు.



నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న తోటి సిబ్బంది


సముచిత వస్త్రధారణపై అవగాహన

- ప్రత్యేక చర్యలు చేపడుతున్న ఎస్‌జేటీఏ

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయాన్ని సందర్శించే భక్తులు సముచిత వస్త్రధారణతో స్వామి దర్శనానికి రావాలని పాలకవర్గం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పాలక వర్గం సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పాలక మండలి నిర్ణయంపై పలు ప్రాంతాల నుంచి విచ్చేసే యాత్రికులు, పర్యాటకులకు చైతన్యపరచి అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే యాత్రికులు, పర్యాటకులు అత్యధికంగా బస చేసే హోటళ్లు, అతిథి గృహాలు మరియు రెస్టారెంటు యాజమాన్యాలకు శ్రీజగన్నాథ ఆలయ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) గురువారం లేఖ రాసింది. సముచిత వస్త్రధారణపై యాత్రికులకు అవగాహన కల్పించడంలో తమ వర్గాల్ని చైతన్యపరచాలని పూరీలోని హోటల్ మరియు రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మరియు కార్యదర్శికి లేఖ రాసినట్లు ఎస్‌జేటీఏ పేర్కొంది. ఇదే రీతిలో టూరిస్ట్ గైడ్‌లు, యాత్రికుల పండాలకు ఆలయ అధికార వర్గం లేఖలు జారీ చేసినట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ రంజన్ కుమార్ దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి వరకు అవగాహన కార్యక్రమం కొనసాగుతుంది. నూతన సంవత్సరం నుంచి ఆలయ నిర్వాహకులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

దుస్తుల జాబితా నిర్దేశించలేదు

ఎస్‌జేటీఏ ఎలాంటి నిర్ధారిత దుస్తుల జాబితాను నిర్దేశించ లేదు. భక్తులు తమ విచక్షణతో తగిన మరియు సముచితమైన దుస్తులు ధరించాలి. పురుషులు ప్యాంటు, షర్టులు, చుడీదార్-పంజాబీ మరియు ధోతీ ధరించవచ్చు, అలాగే మహిళా భక్తులు చీరలు, సల్వార్-కమీజ్ వంటి సాంప్రదాయ దుస్తులను ఉపయోగించవచ్చని లేఖలో పేర్కొంది. భక్తులు మరియు యాత్రికులు సముచితమైన మరియు మర్యాదపూర్వకమైన దుస్తులు ధరించాలని శ్రీజగన్నాథ ఆలయం సేవా సబ్ కమిటీ ఇటీవల నిర్ణయించింది. షార్ట్‌లు, లోదుస్తులు పారదర్శకంగా మరియు బహిర్గతమయ్యే దుస్తులు, చిరిగిన మరియు అర్ధ నగ్న జీన్స్ మరియు ఇతర అనుచితమైన దుస్తులు ధరించే వారిని దర్శనానికి అనుమతించరు. మర్యాదపూర్వకమైన దుస్తులు మతపరమైన ప్రదేశాల్లో మతపరమైన పవిత్రతను మరియు ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరిరక్షిస్తాయని తెలిపారు.



శ్రీజగన్నాథ దేవస్థానం

ప్రయాణికుల రైళ్ల రద్దు పొడిగింపు



కొరాపుట్ సమీపంలో ట్రాక్ పునరుద్ధరణ చేస్తున్న దృశ్యం

కొరాపుట్: కొత్తవలస-కిరండోల్ రైల్వేలైన్‌లో ప్రయాణికుల రైళ్ల రద్దు కొనసాగుతోంది. కొరాపుట్ నుంచి కిరండోల్ మార్గంలో జంత్రి-మలబార్‌ల మధ్య గత నెల 24వ తేదీన మట్టి కొండలు ముందుకు జరగడంతో రైల్వే ట్రాక్ కప్పబడిపోయింది. నాటి నుంచి వందలాది మంది సిబ్బంది కష్టపడి ఈనెల 10వ తేదీన ట్రాక్ పునరుద్ధరించారు. అనంతరం అధికారుల అనుమతితో గూడ్స్ రైళ్లని నడుపుతున్నారు. కానీ ప్రయాణికుల రైళ్లని పొడగించాలని అధికారులు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గురువారం మరికొంత మట్టి కదలడం అధికారులు గమనించారు. దీంతో ఈనెల 14వ తేదీ వరకు ప్రయాణికుల రైళ్లని రద్దు చేశారు. అప్పటికీ పరిస్థితి మారకపాతే ఈ రద్దు పొడిగించే అవకాశం ఉంది. ఈ మార్గంలో రాయ్‌పూర్, భువనేశ్వర్, విశాఖపట్నం, రౌర్కెలా, కోలకత్త ప్రాంతాలకు 10 ప్రయాణికుల రైళ్లు నడిచేవి. గూడ్స్ రైళ్లకి ప్రమాదం జరిగినా నష్ట నివారణ చర్యలు చేపట్టవచ్చు కానీ ప్రయాణికుల రైళ్లపై సాహసం చేయకూడదని అధికారులు ఆలోచిస్తున్నారు.

'పెంచిన సంక్షేమ నిధి స్టాంపు రుసుం ఉపసంహరించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయంతో న్యాయవాదుల సంక్షేమ నిధి స్టాంపుల రుసుంను ఒక్కసారిగా రూ.20కు పెంచడాన్ని నిరసిస్తూ ఈనెల 13 నుంచి 20వ తేదీ వరకు న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించేందుకు తీర్మానం చేశారు. జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం కోర్టు బార్ హాల్‌లో అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా న్యాయవాదుల సంక్షేమం నిధి పెంపు, ఇటీవల పెంచిన సంక్షేమ స్టాంపులు అంశాలపై న్యాయవాదులు సుదీర్ఘంగా చర్చించారు. 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గంజాయి స్వాధీనం



పర్లాకిమిడి: గంజాయితో పట్టుబడిన నిందితులు

బరంపురం: గంజాం జిల్లాలోని అస్కా బస్టాండ్ నుంచి రాజధాని మీదుగా సూరత్ తరలించేందుకు సిద్ధం చేసిన 134 కిలోల గంజాయి బస్తాలతో 6 మంది నిందితులు పోలీసులకు చిక్కారు. ఐఐసీ అధికారి ప్రశాంత్ కుమార్ సాహు తెలిపిన వివరాల మేరకు గురువారం అర్ధరాత్రి గంజాం జిల్లా అస్కా పోలీసుస్టేషన్ పరిధి అస్కా బస్టాండ్‌లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో భువనేశ్వర్‌కు బస్సులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులు పట్టుబడ్డారు. దీంతో వారిని అరెస్టు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఒక ప్రైవేటు వాహనంలో 60 కిలోల గంజాయి పట్టుబడినట్లు ఆర్.ఉదయగిరి ఐఐసీ ప్రశాంత్ మల్లిక్ తెలియజేశారు. పట్టుబడిన వాహనం డ్రైవర్ మోహనా బ్లాక్ ఛెలాగడ గ్రామానికి చెందిన వాడుగా పోలీసులు వెల్లడించారు. మరికొన్ని వివరాలు సేకరిస్తున్నారు.



బరంపురం: అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపును స్థానిక పైడితల్లి అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి మాట్లాడుతూ చదురుగుడి హుండీల నుంచి 26 రోజులకు గాను రూ.10 లక్షల 38వేల 338 నగదు, 9.800 గ్రాముల బంగారం, 134 గ్రాముల వెండి వచ్చిందన్నారు. అదేవిధంగా వనంగుడి హుండీల నుంచి 56 రోజులకు గాను రూ.4 లక్షల 87వేల 731 నగదు, 1.5 గ్రాముల బంగారం, 541 గ్రాముల వెండి లభించిందన్నారు కార్యక్రమంలో ట్రస్టు బోర్డు ప్రతినిధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పరుగు పందెంలో ప్రతిభ



జాతీయస్థాయి పరుగు పందెంలో ప్రథమ స్థానం పొందిన రమేష్

గుమ్మలక్ష్మీపురం: నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ సంస్థ గోవాలో ఈనెల 8న నిర్వహించిన జాతీయస్థాయి 10 కిలోమీటర్ల పరుగు పందెంలో గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి జి.రమేష్ ప్రథమ స్థానం పొందినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం తెలిపారు. కేవలం 56 నిమిషాల 31 సెకెండ్లలోనే పది కిలోమీటర్ల పరుగుపందెం పూర్తిచేసి రూ.50వేల నగదు బహుమతితో పాటు పతకం పొందిన రమేష్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల అధ్యాపకులు గురువారం అభినందించారు. థర్డ్ జెండర్ అయినప్పటికీ రాష్ట్ర స్థాయిని దాటి జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరచడం సంతోషదాయకమంటూ ప్రశంసించారు.

అమృత్‌భారత్ పథకంలో కొత్తవలస రైల్వేస్టేషన్

- స్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్



కొత్తవలస రైల్వేస్టేషన్‌లో సాంకేతిక నిపుణులతో కలిసి పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్

కొత్తవలస: మండల కేంద్రంలో గల రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. అమృత్ భారత్ పథకంలో సుమారు రూ.15కోట్లతో అభివృద్ధి చేసేందుకు ఈ స్టేషన్ ఎంపికైంది. ఈ మేరకు డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ గురువారం ఆర్కిటెక్టులతో కలిసి వచ్చి స్టేషన్‌లో పరిశీలించారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేలా రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు ఇంజినీర్లతో చర్చించారు. అనంతరం డీఆర్‌ఎం మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో వాల్తేర్ డివిజన్ పరిధిలో మొదటివిడతగా ఛతీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 15 స్టేషన్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కొత్తవలస రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం 5 ప్లాట్‌ఫాంలు ఉన్నాయని నాల్గవ లైన్ నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి వచ్చేనాటికి మరో రెండు ప్లాట్‌ఫాంలు నిర్మిస్తామని చెప్పారు.

డీఆర్‌ఎంకు వినతిపత్రం

కాగా ఈ స్టేషన్‌లో కరోనాకు ముందు చాలా రైళ్లు నిలిపేవారని ప్రస్తుతం ఆ రైళ్లు ఆపడంలేదని కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్యరామస్వామి, వార్డు మెంబర్లతో కలిసి డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

వాట్సాప్ మెసేజ్‌లకు మోసపోయిన మహిళ

విజయనగరం క్రైమ్: వాట్సాప్ మెసెజ్‌లకు స్పందించిన ఓ మహిళ తన వద్ద నుంచే కాకుండా తోటి బంధువులు, మిత్రుల వద్ద నుంచి డబ్బులు పంపించి చివరకు మోసపోయినట్లు తెలుసుకుని వన్‌టౌన్ పోలీసులను గురువారం ఆశ్రయించి ఫిరాదు చేసింది. ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. వర్క్ ఫ్రమ్ హోమ్ ఇన్ఫోసిస్ కంపెనీలో జాబ్ చేస్తున్న ఓ యువతి ఉడాకాలనీలో నివాసం ఉంటోంది. ఆమె మొబైల్‌కి జితీషా అనే మహిళ నుంచి వాట్సాప్ మెసెజ్ వచ్చింది. దానికి స్పందించిన బాధితురాలు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న ఆశతో వాట్సాప్‌లో వచ్చిన వ్యక్తులిచ్చిన టార్గెట్‌లను పూర్తి చేస్తూ వచ్చింది. ఆ విధంగా రూ.6 లక్షల 76వేల 767 కలెక్ట్ చేసి పంపించింది. అయితే ఎంతకూ తనకు రావాలిన్న అమౌంట్ ఎంతకీ రాకపోవడంతో పాటు అవతలి వారి మొబైల్స్ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో మోసపోయానని గుర్తించి వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ఐటీయాక్ట్ కింద కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ కాల్చేస్తున్నారు..!

- వర్షాకాలంలోనూ పెరిగిన విద్యుత్ డిమాండ్
- రోజుకు 400 మెగావాట్స్ విద్యుత్ కేటాయింపు
- వినియోగిస్తున్నది 480 మెగావాట్స్



దాసన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్

విజయనగరం ఫోర్ట్: వర్షాకాలంలో చల్లటి వాతావరణం ఉండడంతో ఫ్యాన్ వేయడానికి కూడా ఎవరూ సాహసించరు. కానీ అది ఒకప్పటి మాట. ప్రస్తుత వాతావరణం వేసవిని తలపిస్తోంది. ఎండ వేడిమితో పాటు ఉక్క బోత ఉండడంతో జనం అల్లాడుతున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు అధికంగా వినియోగిస్తున్నారు. ఫలితంగా విద్యుత్ వినియోగం పెరిగింది సాధారణంగా వర్షకాలంలో విద్యుత్ వినియోగం తగ్గుతుంది. వేసవిమాదిరిగానే విద్యుత్ వినియోగం జిల్లాలో ఈ ఏడాది జరుగుతోంది. జిల్లాకు కేటాయించిన దానికంటే అధికంగానే విద్యుత్ వినియోగమవుతోంది. ప్రస్తుతం గృహవినియోగదారులతో పాటు, పరిశ్రమలు, వ్యవసాయానికి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం మళ్లీ పెరిగింది. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. జిల్లాలో సగటున రోజుకు వ్యవసాయానికి 20 మెగావాట్స్ వరకు విద్యుత్ అవసరం ఉంటుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా జరగడంతో 25 నుంచి 30 మెగావాట్స్ వరకు విద్యుత్ వినియోగం పెరిగింది. అదేవిధంగా పరిశ్రమల్లో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. ముఖ్యంగా ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు జిల్లాలో ఎక్కువగా విద్యుత్‌ను వినియోగిస్తున్నాయి.

కేటాయించిన దానికంటే అదనంగా వినియోగం

జిల్లాకు కేటాయించిన దానికంటే విద్యుత్‌ను అధికంగానే వినియోగిస్తున్నారు. జిల్లాకు 400 మెగావాట్స్ కేటాయించగా. ప్రస్తుతం 480మెగావాట్స్ వినియోగమవుతోంది. కేటాయించిన దానికంటే అదనంగా 80 మెగావాట్స్ వినియోగిస్తున్నారు.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో కేటగిరి -1విద్యుత్ కనెక్షన్లు 6,56,558 ఉన్నాయి. కేటగిరి -2 కనెక్షన్లు 74,288, కేటగిరి-3 కనెక్షన్లు 3,806 ఉన్నాయి. కేటగిరి-4 కనెక్షన్లు 12,696, హెచ్‌టీ 388, వ్యవసాయం 37,183 కనెక్షన్లు ఉన్నాయి.

> **విద్యుత్ వినియోగం పెరిగింది**
>
> జిల్లాకు కేటాయించిన విద్యుత్ కంటే అధికంగానే విద్యుత్ వినియోగమవుతోంది. పరిశ్రమలు ఎక్కువ విద్యుత్ వినియోగం పెరిగింది. వ్యవసాయ పనులు ప్రారంభం కావడం వల్ల సాధారణంగా వినియోగించిన దానికంటే 5 నుంచి 10 శాతం విద్యుత్ వినియోగం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో పెరిగింది.
>
> మువ్వల లక్ష్మణరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ

అండర్-19 పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



పోటీల్లో యోగాసనాలు వేస్తున్న క్రీడాకారులు



బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

విజయనగరం: స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక గురువారం పూర్తయింది. ఈ మేరకు నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొత్తం 5 క్రీడాంశాల్లో నిర్వహించిన ఎంపిక పోటీలకు విజయనగరం, పార్వతీపురం -మన్యం జిల్లాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన ఎంపిక పోటీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 10 మంది బాలురు, 10 మంది బాలికలు అర్హత సాధించగా..వైఎస్సార్ కడప జిల్లాలో జరగబోయే బేస్‌బాల్ పోటీలకు 16 మంది బాలురు, 16 మంది బాలికలు ఎంపికయ్యారు. అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లాలో జరగనున్న చెస్ పోటీలకు 14 మంది క్రీడాకారులు, యోగా పోటీలకు 14 మంది జిల్లా నుంచి ఎంపికయ్యారు. గుంటూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు 10 మంది బాలురు, 10 మంది బాలికలు అర్హత సాధించినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ తెలిపారు. ఈ ఎంపిక పోటీలను పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి హాకీ క్రీడాకారులకు శిక్షణ



హాకీ క్రీడలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సీతంపేట: ఈనెలాఖరులో అనకాపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు సంబందించి గిరిజన విద్యార్థులకు స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో హాకీ విభాగంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 సంవత్సరాల లోపు గ్రూపులలో విద్యార్థులు ఇటీవల జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. సీతంపేట బాలికల ఆశ్రమపాఠశాల, బాలురు, మల్లి ఆశ్రమపాఠశాల, కేజీబీవీ, గురుకులం విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు.

సారా విక్రయాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్‌ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్ ఉపేంద్ర ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పార్వతీపురం మున్సిపాలిటీలో సారా విక్రయంపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాకాలనీ పరిధిలో కాలనీకి చెందిన సొండి వినోద్ సారా ప్యాకింగ్ చేసి అమ్మకాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామని ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తెలిపారు. 500 సారా ప్యాకెట్లు, 160 లీటర్ల సారా క్యాన్లు సీజ్ చేశామని చెప్పారు. వినోద్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తులో భాగంగా మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై జర్నలిస్టుల ఆగ్రహం

- ఏఎస్పీకి వినతిపత్రం అందజేత



కలెక్టరేట్‌లో గాంధీ బొమ్మ ఎదుట నిరసనలో జర్నలిస్టులు

విజయనగరం అర్బన్: టీడీపీ నాయకులు హద్దుల్లో ఉండాలి. సాధారణ కార్యకర్తలు కూడా మాపై దాడి చేద్దామని ప్రయత్నిస్తే చేతులు ముడుచుకుని లేం ..జర్నలిస్టుల ఐక్యత చూపిస్తామని..టీడీపీ నాయకులారా ఖబడ్దార్..అంటూ జిల్లా జర్నలిస్టులు పలువురు హెచ్చరించారు. టీడీపీపై ఓ దినపత్రికలో వచ్చిన కథనం పట్ల ఆ పార్టీ స్థానిక కార్యకర్తలు సంబంధిత జర్నలిస్టుపై వ్యక్తం చేసిన దురుసు ప్రవర్తనను నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏఎస్పీ ఆస్మా ఫర్హీన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులపై టీడీపీ దాడులకు తెగబడే దుష్ట సంప్రదాయానికి అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై దాడులు, నిలదీతలు వంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్నది ఎన్నికల సమయమని జర్నలిస్టులు ఎన్నో విశ్లేషణాత్మకమైన కథనాలను రాస్తారని వారిపై ఇలాంటి దుశ్చర్యలు ఎదురవకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పీవీఎస్‌ప్రసాద్, పంచాది అప్పారావు, జి.కోటేశ్వరరావు, ఎంఎస్ఎన్‌రాజు, బీజీవీఆర్‌పాత్రో, వెంకట్, ఉర్లాపు సింహాచలం, కె.రమేష్‌నాయుడు, అవనాపు సత్యనారాయణ, శర్మ, హేమంత్, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేరుతో పాటు మనసు కూడా బంగారమే

- దొరికిన బంగారాన్ని బాధితుడికి అందించిన యువకుడు



శశిభూషణరావుకు బంగారాన్ని, బంగార్రాజు చేతుల మీదుగా అందిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

రేగిడి: మండలంలో ఉంగరాడమెట్టకు చెందిన బోగి బంగార్రాజు తన పేరు మాత్రమే కాకుండా మనసు కూడా బంగారమేనని నిరూపించుకున్నాడు. తనకు దొరికిన 7 తులాల బంగారాన్ని ఉంచుకోకుండా, బాధితులకు పోలీసుల సహకారంతో అందజేసి అందరితో మన్ననలు పొందాడు. ఉంగరాడమెట్ట వద్ద జ్యూస్ షాపు నడుపుతున్న బంగార్రాజుకు షాపు సమీపంలో రోడ్డుపై 7 తులాల బంగారు ఆభరణాలు దొరికాయి. వాటిపై స్థానిక ఎస్సై శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చి అందజేశారు. ఇదిలా ఉండగా తాము రాజాం వెళ్లి వస్తుండగా బ్యాగులోని బంగారు వస్తువులు జారిపడి పోయాయని అదే మండలం కొత్తచెలికానివలస గ్రామానికి చెందిన కర్రి శశిభూషణరావు పోలీసులకు ఫిర్యాదుచేయడంతో స్పందించిన ఎస్సై శశిభూషణరావును పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఆరాతీశారు. బంగార్రాజుకు దొరికిన బంగారు వస్తువులు శశిభూషణరావువిగా గుర్తించి, పెద్దల సమక్షంలో అందజేశారు. పోయిన బంగారం తిరిగి దొరకడంతో శశిభూషణరావు ఆనందానికి అవధుల్లేవు. ఇదిలా ఉండగా తనకు దొరికిన బంగారాన్ని జాగ్రత్తగా పోలీసులకు అందించి, బాధితులకు అందేలా చేసిన బంగార్రాజును ఎస్సై శ్రీనివాసరావుతో పాటు పలువురు అభినందించారు.

విజేతలుగా బీహార్, బరోడా జట్లు

- 322 పరుగుల భారీ తేడాతో అస్సాంపై నెగ్గిన బరోడా జట్టు
- ధర్రి, అతోషోయ్ బెనర్జీ శతకాలు



5 వికెట్లు సాధించిన బీహార్ జట్టు బౌలర్ బేబీ రోజ



సెంచరీలు సాధించిన ధర్రీ, అతోషోయ్ బెనర్జీ

విజయనగరం రూరల్: భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో గ్రూప్- ఈ విభాగంలో ఈ నెల 8 నుంచి జరుగుతున్న అంతర్ రాష్ట్ర అండర్-19 మహిళల వన్డే క్రికెట్ పోటీలు ఏకపక్షంగా సాగుతున్నాయి. జిల్లాలోని మూడు వేదికల్లో గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో బీహార్, బరోడా జట్లు భారీ విజయాలను నమోదు చేయగా, మధ్యప్రదేశ్ జట్టు కేరళ జట్టుపై విజయం సాధించింది. డెంకాడ మండలం చింతలవలసలో ఉన్న డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో బీహార్, మిజోరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన బీహార్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌట్ కాగా, 238 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన మిజోరం జట్టు బీహార్ జట్టు బౌలర్ల ధాటికి 23.3 ఓవర్లలో కేవలం 53 పరుగులకే ఆలౌటై 184 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. బీహార్ జట్టు బౌలరు బేబీ రోజ 9.2 ఓవర్లలో 5 వికెట్లు తీసి జట్టు విజయానికి కృషి చేసింది.

బరోడా భారీ విజయం

విజయనగరం జిల్లా కేంద్రం శివారు సర్ విజ్జీ క్రికెట్ మైదానంలో బరోడా, అస్సాం జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ ఏకపక్షంగానే సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన బరోడా జట్టు నిర్ణీత 50 ఓవర్లో 6 వికెట్లు నష్టానికి 420 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. ఆ జట్టు బ్యాటర్లు ధర్రి 154 పరుగులు, అతోషోయ్ బెనర్జీ 128 పరుగులు సాధించారు. అనంతరం 421 విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన అస్సాం జట్టు బ్యాటర్లు 38.2 ఓవర్లలో 98 పరుగులకే ఆలౌటై 322 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది.

మధ్యప్రదేశ్‌కు మూడో విజయం

దాకమర్రి సమీపం కందుకూరి క్రికెట్ మైదానంలో మధ్యప్రదేశ్, కేరళ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ జట్టు 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన కేరళ జట్టు 46.4 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌట్ కాగా, అనంతరం 137 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు చేపట్టిన మధ్యప్రదేశ్ జట్టు కేవలం 30.3 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 139 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ టోర్నీలో మధ్యప్రదేశ్ జట్టుకు వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

- స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బడ్డుకొండ



సీతారామస్వామికి పూజలు జరిపిస్తున్న అర్చకులు



యాగశాలలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామచంద్ర స్వామి పట్టాభిషేక మహోత్సవాన్ని ఆలయ అర్చకులు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు వేకువజామున స్వామికి సుప్రభాత సేవ, బాల భోగం నిర్వహించిన తరువాత పారాయణాలు, జపాలు, హవనము జరిపించి పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, తదితర కార్యక్రమాలను జరిపించారు. అనంతరం శ్రీరామచంద్రస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ నదీ జలాలతో అభిషేకం జరిపించి శ్రీరామచంద్రమూర్తిని పట్టాభిషిక్తుడిని చేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు దాట్ల సత్యనారాయణరాజు, సత్యం , ధవళ నాగ ఇందు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ఉత్తమ ప్రతిభా పాటవాలతో పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ ఆకాంక్షించారు. ఈనెల 14,15 తేదీల్లో కాకినాడలో జరగనున్న 10వ సీనియర్స్ స్త్రీ, పురుషుల రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలతో పాటు అండర్-23 బాల, బాలికల విభాగాల్లో జరగబోయే పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం పూర్తయ్యాయి. నగరంలోని విజ్జీ స్టేడియంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలను సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడలో రాణించే వారికి ఒలింపిక్స్ పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. వ్యక్తిగత క్రీడాంశమైన ఫెన్సింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు క్రీడల కోటాలో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు పొందవచ్చని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయికి ఎంపికై విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య శిక్షకుడు డీవీ చారి ప్రసాద్ మాట్లాడుతూ రెండు విభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి 80 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల కోచ్ అండ్ మేనేజర్‌లుగా అనిల్‌కుమార్ శర్మ, వెంకటేష్, దాలిరాజు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య, సచివాలయ సేవలపై కేరళ బృందం సంతృప్తి



సచివాలయాల సందర్శన అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కేరళ బృందం

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో పారిశుద్ధ్యం, సచివాలయ సేవలపై కేరళ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఈశ్వరన్ నంబూద్రి ఏకే ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం చీపురుపల్లి మేజర్ పంచాయతీని సందర్శించింది. ఈ సందర్భంగా పట్టణంలోని లావేరురోడ్‌లో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంతో బాటు ఆంజనేయపురంలో ఉన్న గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ, ప్రతిరోజూ జరిగే కార్యక్రమాలు, గ్రీన్ అంబాసిడర్లు, తడి, పొడి చెత్త వేరు చేయడం తదితర విధానాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కేరళ బృందానికి స్థానిక మేజర్ పంచాయతీ అధికారులు ఇక్కడి ప్రభుత్వం అందిస్తున్న సేవలను క్షుణ్ణంగా వివరించారు.

అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఎంతో ఆదర్శంగా ఉందని ప్రశంసించారు. ప్రజల ముంగిటకే సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. అంతకుముందు మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద బా పూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళి అర్పించారు. కేరళ నుంచి వచ్చిన అధి కారుల బృందానికి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బెల్లా న వంశీకృష్ణ, మంగళగిరి శ్రీను, ఏఓ గోవర్ధన్, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, పంచాయతీ అధికారి ఝాన్సీరాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, పంచాయతీ సిబ్బంది రామ్మోహన్, ఈశ్వరరావు, గంగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ముద్దాయిలకు యావజ్జీవం



ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: ఓ హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 చొప్పున జరిమానాను పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్. దామోదర్ రావు విధించినట్లు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాచిపెంట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎ1. కొర్ర చిన్నారావు, అదే గ్రామానికి చెందిన ఎ2. వంతల పొట్టయ్య శ్రీనులను ముద్దాయిలుగా నిర్ధారించి న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారన్నారు. చిల్లంగా ఉందనే నెపంతో గొడవపడి కర్రతో కొట్టడంవల్ల అదే గ్రామానికి చెందిన మల్లయ్యకు (52) మృతి చెందినట్లు మృతుడి భార్య కొర్ర గర్రమ్మ 2018 జనవరి 20వ తేదీన పాచిపెంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించి నిందితులను అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచగా విచారణ అనంతరం ముద్దాయిలను నిర్ధారించి న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని తెలిపారు.

ఈ కేసులో ట్రయల్ పర్యవేక్షణ అధికారి ఎస్సీఅండ్‌ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీధర్, అప్పటి కేసు దర్యాప్తు అధికారి సీఐ జి.సంజీవ రావులను, సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచి కేసులో పురోగతి చూపించిన కానిస్టేబుల్ రామ్మోహన్ రావును విక్రాంత్ పాటిల్ అభినందించారు.

పైడితల్లి ఉత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఉత్సవ ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ సుధారాణి, ట్రస్టు బోర్డు ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఉత్సవ వివరాలతో కూడిన ఆహ్వాన పత్రికలను పైడితల్లి దేవస్థానం కార్యాలయ ఆవరణలో ఈఓ సుధారాణి, ట్రస్టు సభ్యులు గురువారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ సిరిమానును నెల్లిమర్ల మండలం జరజాపుపేట నుంచి ఆదివారం తీసుకువచ్చి హుకుంపేటలో పూజారి ఇంటివద్ద సిరిమానుగా మలుస్తారన్నారు. ఈ నెల 30న తొలేళ్ల సంబరాలు, 31న నిర్వహించే సిరిమానోత్సవానికి ఆహ్వానిస్తూ పెద్దలందరికీ ఆహ్వానపత్రికలను పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్టుబోర్డు ప్రతినిధులు పతివాడ వెంకటరావు, తాడ్డి సురేష్, డాక్టర్ ఎస్.అచ్చిరెడ్డి, నక్కా జ్యోతి, రామ్‌సింగ్ సూరమ్మ, గొర్లె ఉమ, చిల్లా పుష్ప, గంధంలావణ్య, వెత్సా శ్రీనివాసరావు, వాసు, అధికారులు పాల్గొన్నారు.